# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 18 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు బైక్ ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. చన్‌గోములు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం మేడికొండ గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ (21), హర్షవర్ధన్ (15), గొంగుపల్లికి చెందిన ఎం.ప్రవీణ్ (20) వీరు ముగ్గురు కలిసి గురువారం ఉదయం బైక్‌పై మేడి కొండ నుంచి మన్నెగూడకు వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న హైదరాబాద్ నుంచి పరిగి మీదుగా సేడం వెళ్తున్న ఆర్టీసీ బస్సును పూడూరు స్టేజీ సమీపంలో ద్విచక్రవాహనంతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మెడికొండకు చెందిన నవీన్‌కుమార్, హర్షవర్ధన్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కాగా వెంటనే పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, పరిగి డిఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్‌లతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి రోడ్డు ప్రమాదం జరిగిన వివరాలను తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.




# మూసీ సుందరీకరణ కాదు పునరుజ్జీవం

- తెలంగాణ ప్రజల భవిష్యత్తు, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే కార్యాచరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు
- ఎలా ముందుకెళ్లాలో ప్రతిపక్షాలు సలహాలివ్వాలి
- హైడ్రాకు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ముడిపెట్టొద్దు.
- శనివారంలోగా యాక్షన్ ప్లాన్ తెలపాలి
- మూసీపై క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు
- పర్యావరణ వేత్తలు, విద్యా వేత్తలు, సంపాదకులతో కూడా సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం.
- ప్రాజెక్ట్‌పై చర్చించేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలపై మాట్లాడారు.

రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కార్ చేపట్టిందని అన్నారు.33 టీమ్‌లు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయన్నారు. నదీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారన్న సీఎం, వారికి మెరుగైన జీవితం అందించాలని తాము భావిస్తున్నట్లు తెలిపారు. కొందరి మెదడుల్లో మూసీలో ఉన్న మురికి కంటే ఎక్కువ విషం ఉందని, అందుకే ఈ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై ధ్వజమెత్తారు. దుబాయ్ వెళ్లి.. సుందరీకరణ పేరుతో గుండు మీద జుట్టు పెంచుకొనే పాలసీ కాదని.. పోలీసులతో గుర్రాలతో తొక్కించినట్టు చేయబోమన్నారు. కొండపోచమ్మ , రంగనాయక సాగర్ , మల్లన్న సాగర్, కిష్టాపూర్ కి నేను సెక్యూరిటీ లేకుండా వస్తా.. మీరు వస్తారా అని బీఆర్ఎస్ నాయకులకు రేవంత్ సవాల్ విసిరారు.

1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయన్నారు. తాము ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించటంలేదని, నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చినట్లు తెలిపారు. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది తప్ప పరివాహకంలో ఎవరి ఇళ్లను కూల్చలేదన్నారు. చినుకు పడితే చాలు హైదరాబాద్ నగరంలో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోందన్న సీఎం, రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా? అని ప్రశ్నించారు.

మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని బీఆర్ఎస్ నేత కేటీఆర్ అనలేదా అని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి, అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు పాటు మూసీ ఒడ్డున జీవించి చూపాలని సవాలు విసిరారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా ఈటల రాజేందర్ 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలని, వాళ్లు 3 నెలలు అక్కడ

మిగితా 3వ పేజీలో

## పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు



- గతంలో వైఎస్సార్, చంద్రబాబు నాయుడు లాంటి వాళ్లతోనే కొట్లాడాం
- ఈ చిట్టి నాయుడు లెక్క కాదు
- గుంపు మేస్త్రీ అంటే కట్టేటోడు.. ఈ చిట్టినాయుడు కూల్చేటోడు
- రాష్ట్రంలో ఏ వర్గానికి కష్టం వచ్చినా తెలంగాణ భవన్ అండగా నిలుస్తుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పోరాటాలు బీఆర్ఎస్‌కు కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గతంలో వైఎస్సార్, చంద్రబాబు నాయుడు లాంటి వాళ్లనే కొట్టాడామని చెప్పారు. ఈ చిట్టి నాయుడు లెక్క కాదని అన్నారు. రాష్ట్రంలో ఏ వర్గానికి కష్టం వచ్చినా తెలంగాణ భవన్ అండగా నిలుస్తుందన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చిట్టి నాయుడి పాలనలో ప్రతి ఒక్కరి బాధ పడుతున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఎన్నో ప్రాణత్యాగాలతో ఏర్పడ్డ రాష్ట్రం ఇది. మీ త్యాగాలతో పునీతమైన నేల ఈ తెలంగాణ నేల. ఈ పదేండ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో పని చేశాం. నీళ్లల్లో సంపూర్ణమైన విజయం సాధించాం. కాళేశ్వరం వంద శాతం పూర్తయింది. పాలమూరు %-% రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులు 95 శాతం పూర్తయ్యాయి. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇచ్చి దశాబ్దాల తాగునీటి గోసను సమూలంగా తుడిచిపెట్టాం అని కేటీఆర్ తెలిపారు.నిధుల విషయానికి వస్తే.. 2014లో తలసరి ఆదాయంలో తెలంగాణ 14వ స్థానంలో ఉండే. గతేడాది కేసీఆర్ దిగిపోయే నాటికి తలసరి ఆదాయంలో నంబర్ వన్ స్థానానికి ఎదిగాం. అన్ని వర్గాల కుటుంబాల్లో ఒక ఆర్థిక భరోసా నింపామని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తెలంగాణ భవన్‌కు వస్తున్నారు.. 10 జిల్లాల నుంచి ఆశా కార్యకర్తలు వచ్చి తమ బాధలు చెప్పుకున్నారు. మా జీతం రూ. 1500 ఉంటే.. అడగకముందే రూ. 9900 చేసిన మహానుభావుడు కేసీఆర్ అని ఆశా కార్యకర్తలు తెలుపుతున్నారు. మాకు ఆశ పెట్టి మోసం చేశారని ఆవేదన చెందారు. 9 వేలు ఏంది.. 18 వేలు ఇస్తామని చెప్పి పత్తా లేకుండా పోయారు. మా కోసం మాట్లాడండి అని కోరారు.

మిగితా 3వ పేజీలో

## గ్రూప్-1 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆదేశించారు. ఈ నెల 21 నుంచి 27 వరకు జరగనున్న పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. గురువారం సెక్రటేరియట్ నుంచి టీజీపీఎస్సీ నుంచి చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీజీపీ జితేందర్‌తో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లతో పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని, కలెక్టర్లు నేరుగా పరీక్షలను పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు. 2011 తర్వాత ఈ పరీక్షలు జరుగుతున్నాయని, ఎలాంటి అపోహలు, పుకార్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని టీజీపీఎస్సీ నుంచి చైర్మన్ మహేందర్‌రెడ్డి నిర్దేశించారు. అన్ని సెంటర్ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని డీజీపీ జితేందర్ చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని టీజీపీఎస్సీ కార్యదర్శి నికోలస్ వివరించారు.

## తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా..!

కేంద్రానికి సీజేఐ డీవై చంద్రచూడ్ సిఫారసు

వివరాలు 2వ పేజీలో




## జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ బాధ్యతలు స్వీకరణ

బలగం టీవీ , హైదరాబాద్ రాజన్న సిరిసిల్ల

జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా ఐఏఎస్ ఇలంబరితి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబరితికి జీహెచ్ఎంసీ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వర్తించిన ఆమ్రపాలి.. ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ కావడంతో ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పని చేస్తున్న ఇలంబరితికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. డీవోపీటీ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పని చేసిన ఆమ్రపాలి ఏపీలో రిపోర్టు చేశారు.

## గ్రూప్-1 పరీక్షలు వాయిదా వేయాలి




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు గురువారం ఆందోళన చేపట్టారు. హైదరాబాద్ గాంధీనగర్‌లోని పార్కుకు పెద్దఎత్తున తరలివచ్చిన అభ్యర్థులు నిరసనకు దిగారు. జీవో నెంబర్ 29 రద్దుచేసి పాత పద్ధతిలోనే జీఓ నెంబర్ 55ను యధావిధిగా కొనసాగించాలని నినదించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన అభ్యర్థులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకి తరలించారు. ఇక మరికొందరు అభ్యర్థులు రాత్రి 9 గంటల సమయంలో అశోక్‌నగర్ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ విషయంలో జీవో నెంబర్ 29ను తీసుకువచ్చి ఎస్సీ ఎస్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓపెన్ క్యాటగిరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మెరిట్‌లో వచ్చినా రిజర్వ్‌డ్ కేటగిరీకి పరిమితం చేస్తున్నారన్నారు. వెంటనే గ్రూప్ 1 మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇక తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్‌ను అభ్యర్థులు కలిశారు. సమస్యలు వివరించిన అభ్యర్థులు మద్దతివ్వాలని కోరారు. కేసులు పరిష్కారం కాకుండా మెయిన్స్ నిర్వహిస్తే కొత్త చిక్కులు వస్తాయన్న అభ్యర్థులు వాటిని ప్రభుత్వం పట్టించుకోకుండా మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాకపోతే వేటిని చదవాలని ప్రశ్నించారు. తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కేటీఆర్‌ను కోరగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారని అభ్యర్థులు తెలిపారు. న్యాయపరంగా సాయం అందిస్తామని చెప్పారన్న అభ్యర్థులు అవసరమైతే సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించాలని పునరాలోచన చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరారు.

## మరో ఉద్యమానికి మాదిగలు సిద్ధం కావాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకష్ణ మాదిగ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధం కావాలి.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకష్ణ మాదిగ పిలుపునిచ్చారు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వచ్చే డిసెంబర్ నాటికి వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలు పూర్తి చేయడానికి.. వర్గీకరణ విషయంలో కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తూ.. కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఇదే సాక్ష్యమన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే విషయంలో రాష్ట్రం ముందు ఉంటుందని సీఎం అన్నారు.. రేవంత్ మాటలకు విలువ లేకుండా పోయిందన్నారు. మాదిగల పట్ల రేవంత్‌వి తేనే పూసిన మాటలన్నారు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే అని అన్నారు. మొదటి రాష్ట్రం తెలంగాణే అని ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని ఫైర్ అయ్యారు.

ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీన నిండు శాసనసభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తొలుత దేశంలో తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తదని హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందన్నారు. ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ రిజర్వేషన్ల అమల్లో పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ముందు వసరులో ఉన్నాయని మందకృష్ణ తెలిపారు.



పరీక్షల నిర్వహణ కానీ అన్ని నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని రేవంత్ రెడ్డి శాసనసభా వేదికగా చెప్పాడు. దీన్ని కూడా ఆయన విస్మరించాడు. ఇవాళ మాదిగల పొట్ట కొట్టింది రేవంత్ ప్రభుత్వం. 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించారు. ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే అంతకుముందున్న నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్.. అది అమలు చేయకుండానే నియామక పత్రాలు అందజేశారు. ఇంది మాదిగ బిడ్డల పొట్ట కొట్టినట్టు కాదా..? అని రేవంత్ రెడ్డిని మందకృష్ణ మాదిగ నిలదీశారు.

ఈ నెల 25 అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట స్ఫూర్తిని వివరిస్తూ మాదిగల ధర్మ యుద్ధ జిల్లా మహాసభలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదలై 31న నల్గొండ జిల్లాలో పూర్తవుతాయన్నారు. అలాగే మాదిగల ధర్మ యుద్ధ మహాదీక్షలు నవంబర్ 4 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో కొనసాగుతాయని తెలిపారు. నవంబర్ 16 నుంచి డిసెంబర్ 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా మాదిగల ధర్మయుద్ధ రథయాత్ర కోదాడ నుంచి ప్రారంభమై డిసెంబర్ 21న చలో హైదరాబాద్ మాదిగల ధర్మ యుద్ధ మహాప్రదర్శనతో ముగుస్తుందని వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థ ప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు దాదాపు రూ.7 లక్షల కోట్లు



**• ప్రభుత్వ విప్ విప్ అది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

పదేండ్లుగా విధ్వంసమైన ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టింది అని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస అన్నారు.వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పది నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన రుణాలు రూ.49618 కోట్లు అని,పాత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిన వడ్డీలు, కిస్తీలు రూ.56,440 కోట్లు అని అన్నారు.

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసింది, వాటికి ప్రతి నెలా చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలే ప్రభుత్వానికి గుదిబండగా మారాయని అన్నారు. ౦వంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు,అంటే డిసెంబర్ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 49618 కోట్ల మార్కెట్ రుణాలు తీసుకుంది అని,అందులో నుంచి పాత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ. 56440 కోట్లు రీపేమెంట్లు (అసలు, వడ్డీలు కలిపి కిస్తీలు) తిరిగి చెల్లింపులు చేసింది అని అన్నారు. అంటే ఈ పది నెలల్లో కొత్త ప్రభుత్వం తెచ్చిన అప్పులు గత ప్రభుత్వం చేసిన అప్పుల కిస్తీలు, వడ్డీలకు కూడా సరిపోలేదు అని అన్నారు. తమ ప్రభుత్వం తెలంగాణ ప్రజలపై ఉన్న రుణభారం తగ్గించేందుకు కొత్త ప్రభుత్వం ప్రయత్నించిన తీరు ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పట్టింది అని అన్నారు.

అప్పులు తీర్చటంతో పాటు ఈ పది నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.21881 కోట్ల క్యాపిటల్ ఎక్స్పెండిచర్ నమోదు చేసింది అని,ప్రజోపయోగమైన నిర్మాణాలకు, పనులకు మరో రూ. 21881 కోట్లు మూలధన వ్యయంగా ఖర్చు చేయటం గమనార్హం అని అన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసింది అని, రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ, రైతు భరోసా, చేయూత, ఎల్పీజీ సబ్సిడీ, మహాలక్ష్మి, గృహజ్యోతి, విద్యుత్ సబ్సిడీ, బియ్యం సబ్సిడీ, , ఆర్టీసీ, కళ్యాణలక్ష్మి పథకాలకు రూ.54346 కోట్లు ఖర్చు చేసింది అని అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు వడ్డీలు కలిపి తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సగటున ఒక రోజుకు రూ. 181 కోట్లు ఖర్చు పెట్టింది అని

గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా చేసిన అప్పులకు వడ్డీలు, కిస్తీలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చినట్లు స్పష్టమవుతోంది అని అన్నారు.పదేండ్లలో రాష్ట్ర ఖజానాపై మోయలేనంతగా పెరిగిన రుణభారం తగ్గించేందుకు ప్రయత్నాలు చేసింది అని, గత ప్రభుత్వం చేసినట్లుగా ఇష్టారాజ్యంగా అప్పుల జోలికి వెళ్లకుండా నియంత్రణ పాటించింది అని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో ఆడంబరాలకు పోకుండా ప్రభుత్వం ఉంది అని,బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకొని ప్రణాళిక ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానం అనుసరించింది అని, గతంతో పోలిస్తే అప్పులు తగ్గుముఖం పట్టడం శుభసూచకం.అప్పులను నియంత్రించటంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించింది అని అన్నారు.

# శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి

**• కలెక్టర్ సందీప్ కుమార్ ఝు.**



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల :**

ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి ఉత్సవాలలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి,ఆది కవి వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బోయవాణిగా జీవితం గడిపిన వాల్మీకి నారద మహర్షి దివ్య ఉపదేశంతో ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహా గ్రంథాన్ని 24 వేల శ్లోకాలతో ఆది కావ్యంగా పూర్తి చేసిన గొప్ప వ్యక్తి శ్రీ మహర్షి వాల్మీకి అని అన్నారు. మనుషుల్లో మంచి మార్పు వస్తే గొప్ప వారిగా ఎదగడంలో శ్రీవాల్మీకి మహర్షి మనందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. మన చరిత్రను మలుపు తిప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని అన్నారు .

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆదర్శవంతులుగా జీవించి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, బిసి వెల్ఫేర్ అధికారి రాజమనోహర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాం రెడ్డి, సూపరింటెంట్లు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవ



**• వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు.**

**• ఎస్పీ అఖిల్ మహాజన్.**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సోషల్ మీడియాలో వేదికగా మహిళల,విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఫెక్ ఐడి లతో ఇంస్టాగ్రామ్, ఫేస్ బుక్ అకౌంట్ లు క్రియేట్ చేసి,లేదా మహిళల సోషల్ మీడియా అకౌంట్స్ ని హ్యాక్ చేసి అసభ్యకర వీడియోలు, ఫోటోస్ పంపుతుండగా మహిళలు, విద్యార్థినుల వేధింపులకు గురి అవుతున్న ఫిర్యాదులు ఎక్కవ వస్తున్నాయని అన్నారు..అలాంటి వేధింపులకు పాల్పడే పోకిరిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, సోషల్ మీడియా వేదికగా ఆడపిల్లలను,మహిళలను వేధించినా, అసభ్యంకర ఫొటోలు, వీడియోలు పంపిన, సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేసినా, మిత్రులకు షేర్ చేసినా తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఇలాంటి స్సమస్యలపై పోలీస్ నిఘా ఉంటుందని ఇలాంటి సమస్యలపై మహిళలు,విద్యార్థినులు నిర్భయంగా షీ టీమ్ కి ఫిర్యాదు చేయాలని అన్నారు.

జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థినుల పేరుతో ఇంస్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి లేదా వారి అకౌంట్ హ్యాక్ చేసి వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురు పోకిరీలపై కేసు నమోదు చేయ డం జరిగిందని అన్నారు.సోషల్ మీడియా వేదికగా కానీ,పని చేసే ప్రదేశాల్లో కానీ, పాఠశాలలో,కళాశాలల్లో మహిళలను ,విద్యార్థినులకు వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.మహిళలు ,విద్యార్థినులు వేధింపులకు గురైనట్లయితే వెంటనే డయల్ 100, లేదా షీ టీం నెంబర్ 87126 56425 కి పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా..!

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ఆయన పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నవంబర్ 10న రిటైర్ కాను న్నారు. ఈలోగా నూతన సిజెఐ ప్రక్రియ ముగించాల్సి ఉంటుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తి నియామకానికి సంబంధించిన నిబంధనావళి ప్రకారం, ప్రస్తుత సిజెఐ అధ్యక్షతన గల కొలీజియం తదుపరి ప్రధాన న్యాయమూర్తి పేరును ఖరారు చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం మిగతా ప్రక్రియ పూర్తి చేస్తుంది. ప్రస్తుత సిఫారసులను కేంద్రం ఆమోదిస్తే%ా% దేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు చేపట్టనున్నారు. 2019 జనవరి 18న ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల సమయంలో జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. ఆయనకు రాజ్యాంగచట్టాలు, ప్రత్యక్ష పన్నులు, కమర్షియల్ లా, కెంపెనీ లా, పర్యా వరణ చట్టాలు ఇలా అనేక విభాగాల్లో నిష్ణాతుడిగా పేరుంది. అయితే సిజెఐగా ఆ పదవిలో కేవలం ఏడు నెలలు మాత్రమే ఉంటారు. 2025 మే 13 ఆయన రిటైర్ కానున్నారు.

జస్టిస్ సంజీవ్ ఖన్నా 1960 మే 14న జన్మించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేశారు. జస్టిస్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు, ట్రిబ్యునళ్లలో ప్రాక్టీస్ చేశారు. ఆదాయపు పన్ను శాఖకు సంబంధించి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్ గా పనిచేశారు. జస్టిస్ ఖన్నా 2004లో ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ టెరిటరీలో చేరారు. ఢిల్లీ హైకోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా అనేక క్రిమినల్ కేసులకు హాజరై వాదించారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టులోని తన పదవీకాలంలో జస్టిస్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్, డిస్ట్రిక్ట్ కోర్ట్ మధ్యవర్తిత్వ కేంద్రాలకు ఛైర్మన్, ఇన్‌చార్జ్ జడ్జిగా కూడా పనిచేశారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏదైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాకముందే సుప్రీంకోర్టుకు ఎదిగిన కొద్దిమందిలో జస్టిస్ ఖన్నా ఒకరు. ఆయన ప్రస్తుతం భోపాల్‌లోని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగానూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గానూ ఉన్నారు. 2023 జూన్ 17 నుంచి 2023 డిసెంబర్ 25 వరకు సుప్రీం కోర్టు లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ముఖ్యమైన తీర్పులు

వివాదాస్పద సెంట్రల్ విస్టా ప్రాజెక్టుకు గ్రీన్ సిగల్ ఇచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా కూడా ఉన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. ఎలక్టోరల్



బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా కూడా ఉన్నారు. జస్టిస్ ఖన్నా పలు కీలక కేసుల్లో కూడా ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని చెప్పారు. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కేసులో జస్టిస్ ఖన్నా కీలక తీర్పు వెలువరించారు. 2023లో ఒక టీవీ షోలో జర్నలిస్టు వ్యాఖ్యలపై కేసును విచారిస్తున్నప్పుడు, ఆర్టికల్ 21 హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కును అధిగమించడానికి, ఆర్టికల్ 19(1)(ఎ)ని ఉపయోగించలేమని జస్టిస్ ఖన్నా నేతత్వంలోని బెంచ్ నొక్కి చెప్పింది. "ఎవరైనా మాట్లాడే హక్కును నొక్కిచెప్పినట్లయితే, ఇతరులకు వినడానికి లేదా వినకుండా ఉండటానికి హక్కు ఉంటుంది" అని బెంచ్ పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది.

# మహర్షి హై స్కూల్ గుర్తింపు రద్దు

**• విద్యాశాఖ అధికారి రమేష్**

**బలగం టీవీ, ముస్తాబాద్**

ముస్తాబాద్ లో ఉన్న మహర్షి హై స్కూల్ గుర్తింపు రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారి రమేష్ గురు వారం ఉత్తర్వులు జారీ చేశారు. ముస్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి అందించిన నివేదిక ప్రకారం.. నర్సరీ చదువుతున్న చిన్నారి మనోజ్ఞ ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు టైర్ కిందపడి అక్కడికక్కడే మరణించిందని, ఈ సంఘటన స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్, మహర్షి హై స్కూల్ మేనేజ్మెంట్ నిర్లక్ష్యపు వైఖరి కారణంగా జరిగిందని తెలిపారు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రతి పాఠశాలకు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, పి.డబ్ల్యూ.డి శాఖ నుంచి భవన స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ ఉండాలని, మహర్షి హై స్కూల్ మేనేజ్మెంట్ పేర్కొన్న సర్టిఫికెట్లు సబ్మిట్ చేయలేదని అన్నారు.

పాఠశాల వాహనం పార్కింగ్ , మెయింటెనెన్స్ అంశంలో రవాణా శాఖ జారీ చేసిన మెమోలోని సూచనలు , మార్గదర్శకాలను మహర్షి హై స్కూల్ యాజమాన్యం పాటించలేదని, పిల్లల రవాణా సమయంలో స్కూలు యాజ మాన్యం పాటించాల్సిన జాగ్రత్తలు సైతం పాటించడంలో వైఫల్యం చెందారని, దీని కారణంగా ఒక పసి ప్రాణం చిన్నారి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు.

మహర్షి హై స్కూల్ కు సరైన బిల్డింగ్ అనుమతులు సర్టిఫికెట్ లేవని , రవాణా సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు పాటించడం లేదని, పాఠశాలలోని పిల్లలకు సిబ్బంది ప్రాణాలకు ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని ముస్తాబాద్ లోని మహర్షి హై స్కూల్ గుర్తింపు వెంటనే రద్దు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులలో పేర్కొన్నారు.



# ధాన్యం కోనుగోలు కేంద్రాలలో సరైన వసతులు కల్పించాలి..

**• నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర పై కొనుగోలు**

**• కలెక్టర్ సందీప్ కుమార్ ఝు**

**బలగం టీవీ ,సిరిసిల్ల**

ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలో సరైన వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గురువారం కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామంలో ఏర్పాటు చేయుచున్న వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ రోజు నుండి ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా గన్ని బ్యాగుల స్టాక్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు . నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు చేసి వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని,సన్న బియ్యం కొనుగోలు సమయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, టెంట్, కుర్చీలు వంటివి ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, పౌర సరఫరాల మేనేజర్ రజిత, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాస మూర్తి, తదితరులు ఉన్నారు.



# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి పాల్గొన్నారు.స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం స్వామివారి రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఆ స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకొన్నానని తెలిపారు.




# బాధితుల పట్ల తక్షణమే స్పందించాలి..

**-ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ, సిరిసిల్ల :**

ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం చందుర్తి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు.స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దనిసూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ బ్లూ కోల్ట్ ,పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటు పై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా అధికారులు,విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతు ప్రజలకు చట్టాల మీద, డయల్100,షీ టీమ్స్, సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల మీద అవగాహన కల్పించాలని అన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమం లో సిఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# మూసీ సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం




(మొదటి పేజీ తరువాయి)

ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తామని విమర్శించారు. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే, ఈ ప్రాజెక్టును ఆపేస్తామన్నారు. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలని సీఎం అన్నారు. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి లేదా మూసీ పునరుజ్జీవం కోసం వారి (విపక్షాలు) వద్ద ఉన్న ప్రణాళిక చెప్పాలని కోరారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలన్న సీఎం, విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు.

"రచ్చ బండ నిర్వహిద్దాం.. కేసీఆర్.. నీ నియోజక వర్గానికే వస్తా. రచ్చ బండ దగ్గర కూర్చొని మాట్లాడదాం. మాకేం అభ్యంతరం లేదు. ప్రజలు ఇచ్చిన బాధ్యత కాబట్టి ప్రజలకు మేలు చేయాలన్న దే మా ఆలోచన. మూసి సుందరీకరణ కాదు. ప్రక్షాళన. దుబాయ్ వెళ్లి జుట్టు మొలిపించుకునే టట్టు కాదు. నది ప్రవహించే నగరం దేశం లోనే లేదు. అలాంటి నగరం హైదరాబాద్ లో ఉంది. దాన్ని పాలకుల నిర్లక్షం వల్ల మురికి కూపం అయ్యింది. మూసి పునరుజ్జీవం పోస్తాం. సమస్యలు తెలుసుకుని ఒక్కొక్కరిని తరలించాలని మా ఆలోచన" అని అన్నారు. ఆరు నెల్ల నుంచి అధికారులు మూసీ ప్రాజెక్ట్ పై సర్వే చేస్తున్నారని చెప్పారు.

వేములఘాట్.. మల్లన్న సాగర్ ముంపు గ్రామాలు.. ఎవరికైనా ఇండ్లు.. ఇంటి తాళం ఇచ్చారా అని ముఖ్యమంత్రి గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "మిడ్ మనేరు ను పిల్లను ఇచ్చిన పాపానికి ఊరి నే ముంచారు. హైడ్రా ఏదైనా బూతమా.. ఫార్మ్ హౌస్ లో ఉన్న దొరనా. వచ్చి కబలించుకు పోవడానికి.. బఫర్ జోన్ లో 10 వేల ఇండ్లు ఉన్నాయి. వారిని ఎలా ఆదుకోవాలి.. బెటర్ లైఫ్ ఎలా ఇవ్వాలి అని ఎంఎల్ఏ లతో మాట్లాడండి అని మంత్రులకు చెప్పినం. బుల్డోజర్ లు మామీద నుంచి పోనియ్యాలి అని పోటీ పడుతున్నారు. నగరాన్ని సర్వ నాశనం చేయదలుచుకున్నారా అని విపక్షాలను ప్రశ్నించారు.

వర్షం వస్తె చెన్నై.. బెంగుళూరు ఏమైంది చూశారా..? దుబాయ్ ఏమైంది. వయనాడ్ లో పరిస్థితి ఏమైందో తెలియదా ఖమ్మం.. విజయవాడ మునిగి పోయింది. కండ్ల ముందు చూశాం. మూసి వల్ల మాకు ఆర్థిక ప్రయోజనం ఏమైనా ఉందా మాకు..? ఉప్పెన వచ్చిందంటే.. కొట్టుకు పోతాం. నాకు అనుకున్నవి అన్ని వచ్చాయి. నాకేమైనా వస్తుందా.. మీరంతా చెప్పండి.. వద్దు అంటే వదిలేద్దాం. టెండర్ క్యాన్సల్ చేసి పంపుతాం. నల్గొండ వాళ్ళ బాధలు పట్టవా. నల్గొండ వాళ్లంతా అడుగుతున్నారు. నల్గొండ ప్రజలు మౌనంగా ఉంటే ఎలా అన్నారు.

గతంలో . సిలింగ్ యాక్ట్ నీ కూడా దొరలు.. భూస్వాములు వ్యతిరేకించారని.. ఎప్పుడు ఎవరో ఒకరు వ్యతిరేకిస్తునే ఉంటరన్నారు. అధికారం కోల్పోయిన వాళ్ళు కొందరు ఇలా ప్రతిదీ అడ్డుకోవాలని చూస్తున్నారని.. అధికారులు.. మంత్రుల ముసుగులో దోచుకున్న బంది పోటు దొంగలు వాళ్ళు అని తీవ్రంగా విమర్శించారు. అలాంటి బందీ పోటు దొంగలు మూసిని అడ్డుకుంటున్నారని.. అద్దాల మెడల కోసం.. అందాల భామల కోసం మేము చేయడం లేదని మండిపడ్డారు.

# పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు




(మొదటి పేజీ తరువాయి)

సందర్భానుసారంగా సమావేశాలు నిర్వహించి చిట్టి నాయుడిని వణికించి, న్యాయం చేస్తామని ఆశా కార్యకర్తలకు భరోసా ఇచ్చినట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

గ్రూప్-1 వాయిదా కోసం అశోక్ నగర్‌లో నిన్న రాత్రి అభ్యర్థులు రోడ్డెక్కారు. రిజర్వేషన్ల అమలు విషయంలో అన్యాయం జరుగుతుంది. 95 శాతం రిజర్వేషన్లకు తూట్లు పొడుతున్నారు. మాకు ఉద్యోగాలు రాకుండా చిట్టి నాయుడు మోసం చేస్తున్నారని అభ్యర్థులు ఆరోపించారు. 60 శాతం రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కల్పించేవారు. మిగతా 40 శాతం ఓపెన్ కోటాలో జనరల్ కేటగిరిలో కూడా మెరిట్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించేవారు. కానీ ఇవాళ దాన్ని కూడా తుంగలో తొక్కారు. జీవో 55ను రద్దు చేసి జీవో 29ని అమలు చేస్తున్నారు. పరీక్ష రాసేందుకు మాకు అభ్యంతరం లేదు. 3 లక్షల మందిలో 30 వేల మందికి మేం క్వాలిఫై అయ్యాం.. కానీ పరీక్ష రాసిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వం లోపభూయిష్ట ఉత్తర్వులు తప్పుని పరీక్షలను రద్దు చేస్తే మళ్లీ రాయాల్సిన పరిస్థితి వస్తదని గ్రూప్-1 అభ్యర్థులు అంటున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి మూర?పు విధానాల వల్ల గాంధీ భవన్, బీజేపీ ఆఫీసు వైపు జనాలు చూడడం లేదు. చలో తెలంగాణభవన్ అని ఇటు వైపు వస్తున్నారు. హైడ్రా బాధితులు కూడా వచ్చారు. చిట్టి నాయుడి పాలలో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. రైతులు తిట్టని తిట్టు తిడుతున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇవ్వలేదు. బతుకమ్మ చీర దిక్కు లేదు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మ చీరలు, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా వచ్చేవి అని ఆడబిడ్డలు బాధపడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ తెలిపారు.

## సీఎం ప్రెస్‌మీట్‌పై కేటీఆర్ స్పందన

మూసీ రివర్ ఫ్రంట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మీడియా సమావేశంపై బీఆఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మూసీపై శుక్రవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని తెలిపారు.

# టీపీసీసీ చీఫ్‌తో గ్రూప్ 1 అభ్యర్థుల భేటి

- జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని వినతి
- గత ప్రభుత్వంలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారంటూ
- కేటీఆర్ ను నిలదీసిన మహేష్ కుమార్ గౌడ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ గాంధీ భవన్ లో గ్రూప్-1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల డిమాండ్లను తెలుసుకున్నారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. పాత జీవో 55 ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. పాత నోటిఫికేషన్ లో ఇచ్చిన 503 పోస్ట్ లలో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దన్నారు. పెంచిన 60 పోస్ట్ ల్లో మాత్రమే కొత్తగా అప్లై చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. (ప్రభుత్వం కొత్తగా 503 పోస్ట్ ల్లో60 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది). జీవో 29 , రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి పరీక్షలు పెట్టాలనిమహేష్ ను కోరారు.


పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలని అన్నారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సమాచారం అందిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. సాయంత్రం వరకు దీనిపై తగిన సమాచారం ఇస్తామని క్లారిటీ ఇచ్చారు.

మరోవైపు కేటీఆర్ పై పీసీసీ చీఫ్ ఫైర్ అయ్యారు. మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా..? అంటూ కేటీఆర్ కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కేటీఆర్ ను విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నే.. డీఎస్సీ.. వైద్యారోగ్యశాఖ లో ఉద్యోగాలు. గ్రూప్స్.. పోలీసు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మీరు ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు.

# వన్ నేషన్.. వన్ ఎంఎస్‌పీ? ఎందుకు ఇవ్వడం లేదు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



పత్తికి కేంద్ర ప్రభుత్వం దేశమంతా ఒకే విధంగా మద్దతు ధర చెల్లించడం లేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుప్రశ్నించారు. వన్ నేషన్.. వన్ ట్యాక్స్, ఒకే దేశం.. ఒకే ఎలక్షన్, ఒకే దేశం.. ఒకే రేషన్ కార్డ్, వన్ నేషన్.. వన్ మార్కెట్ అంటూ ఊదరగొట్టే కేంద్రం వన్ నేషన్.. వన్ ఎంఎస్పీని ఎందుకు ఇవ్వడం లేదన్నారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఎందుకు ఉందని నిలదీశారు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకు వివక్ష అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ పత్తికి క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణలో పండిస్తున్న పత్తికి రూ.7521 మాత్రమే చెల్లించడం దూర్మార్గమని చెప్పారు. గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా అని ఎక్స్ వేదిగా ప్రశ్నించారు.

నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ. 8,257 చెల్లిస్తున్న కేంద్రం, తెలంగాణ పండిస్తున్న పత్తికి రూ.7,521 మాత్రమే చెల్లించడం దుర్మార్గం. గుజరాత్ కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా..? " అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## హర్యానా సీఎంగా సైనీ ప్రమాణం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



హర్యానా ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి ఓబీసీ నేత నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. వాల్మీకి జయంతి రోజున పంచకులలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయబ్ సింగ్, కొందరు మంత్రులతో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి హిందీలో, మిగిలిన వారు ఇంగ్లీష్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, గడ్కరీ, జేపీ నడ్డా, చిరాగ్ పాశ్వాన్‌తో పాటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు ఎన్డీఏ నేతలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో హర్యానాను శరవేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ తెలిపారు.

# 46 పరుగులకే కుప్పకూలిన భారత్

## రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 180/3








**బలగం టీవీ, బెంగళూరు**

బెంగళూరు వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌లో భారత జట్టు కుప్పకూలింది. 31.2 ఓవర్లలోనే 46 పరుగులకు కుప్పకూలింది. భారత జట్టుకు సొంత గడ్డ మీద టెస్టుల్లో ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. ఓవరాల్‌గా టీమిండియాకు టెస్టుల్లో ఇది మూడో అత్యల్ప స్కోరు.

చిన్నస్వామి స్టేడియంలో భారత్–న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు మొదటి రోజు వర్షార్పణం కాగా రెండో రోజు టాస్‌తో మ్యాచ్ మొదలైంది. న్యూజిలాండ్ బౌలింగ్ ధాటికి భారత బ్యాట్స్ మెన్లు విలవిలలాడిపోయారు. ఐదుగురు బ్యాట్స్‌మెన్లు డకౌట్ రూపంలో వెనుదిరిగడంతో టీమిండియా స్వల్ప స్కోర్ కే పరిమితమైంది. విరాట్ కోహ్లీ, సర్ఫరాజ్ ఖాన్, కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ డకౌట్ రూపంలో వెనుదిరిగారు. రిషబ్ పంత్(20), యశస్వి జైస్వాల్(13), మహ్మద్ సిరాజ్(04 నాటౌట్), రోహిత్ శర్మ(02), కుల్దీప్ యాదవ్(02), జస్ప్రీత్ బుమ్రా(01) పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ ఐదు వికెట్లు, విలియమ్ రూర్కీ నాలుగు వికెట్లు, టిమ్ సౌతీ ఒక వికెట్ తీశాడు.

ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ప్లేయర్లు స్వేచ్ఛగా పరుగులు సాధించారు. ఫలితంగా రెండో రోజు ముగిసే సమయానికి కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 180 పరుగులు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగుల ఆధిక్యం సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తరపున రచిన్ రవీంద్ర 22 పరుగులు, డారిల్ మిచెల్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు. భారత్ తరపున రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ తీశారు.










# ఆస్ట్రేలియాకు షాక్

## మహిళల టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు దక్షిణాఫ్రికా

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల టీ20 వరల్డ్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు షాక్ తగిలింది. గురువారం దుబాయి వేదికగా జరిగిన తొలి సెమీ ఫైనల్లో సౌతాఫ్రికా 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసి తుది పోరుకు దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 135పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 135పరుగులు చేసి గెలిచింది. దీంతో దక్షిణాఫ్రికా మహిళల జట్టు తొలిసారి ఓ ఐసిసి టోర్నీ ఫైనల్లోకి దూసుకొచ్చింది. అన్నెకె బోష్(77 నాటౌట్) విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగగా.. కెప్టెన్ లారా వొల్వార్ట్(47) అద్భుతంగా ఆడింది.



ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 134పరుగులే చేసింది. వికెట్ కీపర్ మూనీ(44), కెప్టెన్ గ్రాత్(27), ఫెర్రీ(31) బ్యాటింగ్‌లో రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లు ఖాకా(2/24), కాప్(1/24), మాబా(1/31) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఆ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా మహిళలు సునాయాసంగానే ఛేదించారు. కెప్టెన్ వోల్వోడార్ట్(42), బోట్స్(74నాటౌట్, 48బంతుల్లో 8ఫోర్లు, సిక్సర్) గెలుపులో కీలకపాత్ర పోషించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బోట్స్‌కు దక్కింది.



## శర్వానంద్ సినిమా కోసం భారీ సెట్


**బలగం టీవీ, హైదరాబాద్**

శర్వానంద్ హీరోగా సంపత్‌నంది దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామ తెరకెక్కనుంది. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 'ఉత్తర తెలంగాణా, తెలంగాణా–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల బ్యాక్‌డ్రాప్‌లో 1960 కాలమానంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఉత్తర తెలంగాణ స్వరూపాన్ని, అప్పటి సంస్కృతిని ప్రతిబిం బించేలా హైదరాబాద్‌కు సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణంలో భారీ బడ్జెట్‌తో కళా దర్శకుడు కిరణ్‌కుమార్ మన్నె ఓ పెద్ద సెట్‌ను క్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా కోసం శర్వానంద్ మేకోవర్ అవుతున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం భీమ్స్, కెమెరా సౌందర్ రాజన్ ఎస్.

## ఎమర్జెన్సీ'కి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎట్టకేలకు తన 'ఎమర్జెన్సీ' మూవీకి సెన్సార్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ స్క్రీనింగ్‌కు అనుమతి ఇచ్చిందని బాలీవుడ్ బ్యూటీ కంగనా రనౌత్ గురువారం ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా పోస్ట్ ద్వారా వెల్లడించింది. త్వరలోనే మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా తన అభిమానులు, శ్రేయోభిలాషులకు మద్దతు తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపింది. బోర్డు సూచించిన సవరణలు, సీన్స్ తొలగింపు అంగీకరించామని జీ స్టూడియోస్ బాంబే హైకోర్టుకు ఇటీవల తెలిపింది.సెన్సార్ బోర్డు సినిమాలో 13 కట్‌లతో పాటు మార్పులు చేసింది. ఆ తర్వాత మూవీకి యూఏ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. జూన్ 1975 నుంచి మార్చి 1977 వరకు భారత్‌లో విధించిన 'ఎమర్జెన్సీ' ఆధారంగా మూవీని తెరకెక్కించారు. ఈ మూవీకి కంగనా దర్శకత్వం వహిస్తూ నటించారు. మాజీ ప్రధాని ఇందిరా పాత్రను పోషించగా.. అనుపమ్ ఖేర్, శ్రేయాస్ తల్పడే, మిలింద్ సోమన్, మహిమా చౌదరి కీలకపాత్రలు పోషించారు.




## 'పుష్ప-2 ది రూల్' కౌంట్‌డౌన్ స్టార్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**

'పుష్ప–2' ది రూల్‌కు కౌంట్‌స్టార్ట్ అయ్యింది. మరో50 రోజుల్లో అంటే డిసెంబరు 6న పుష్ప–2 రూల్ బాక్సాఫీస్‌పై ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ఐకాన్‌స్టార్ మాసివ్ లుక్‌తో పుష్పరాజ్‌గా రూల్ చేయడానికి సింహాసనం అధిష్టించిన ఓ పోస్టర్‌ను వదిలారు. అంతేకాదు డిసెంబరు 6న భారతీయ సినిమాలో ఆ రోజు ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభం కానుందని హింట్ ఇచ్చారు మేకర్స్.అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ–కథనం–దర్శకత్వం: సుకుమార్.బి. నిర్మాతలు: నవీన్ ఏర్నేని, వై రవిశంకర్. సినిమాటోగ్రాఫర్: మిరోస్లా క్యూబా బ్రోజెక్. సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

